

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**జె – హాల్ – ఎ – మిస్కీన్ మకున్ – బ – రంజిష్**

**బహాల్ – ఎ – హిజ్ర బేచారా దిల్‌హై**

1980 దశకంలోని మరుపురాని మధురమైన వెంటాడే యుగళ గీతాలలో అగ్రస్థానంలో ఉంటుంది 'గులామీ' సినిమాలో లత, శబ్బీర్ కుమార్‌లు పాడిన ఈపాట. పాట విన్నవారిలో అనేకులకు ఈ పదాల అర్థం తెలియకున్నా పదాలలో ఉన్న వింత ఆకర్షణ, లత స్వరం, లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌ల సంగీతం ఈ పాటను అత్యంత ఆకర్షణీయం చేసింది. ఈనాటికీ  విన్నవారి మనస్సులలో పాటను సజీవంగా నిలుపుతోంది. జానపద సాహిత్యానికి, పర్షియన్ సంగీతంతో ముడిపెట్టి సంతూర్, తబలాలతో అత్యంత మృదుగంభీరమైన సున్నిత భావనలను జాగృతం చేసే ఈ గీతాన్ని రూపొందించారు లక్ష్మీ ప్యారేలు.

'గాయపడి ఉన్న నా పేద హృదయంపై జాలి ప్రదర్శించు. దాన్ని చులకన చేయకు. నీకు దూరమైన విరహవేదన నా హృదయంలో చేసిన గాయం ఇంకా మానలేదు. నా హృదయ వేదనను గమనించు. '

పల్లవిలోని మొదటి రెండు పాదాల అర్థం ఇది.

'గులామీ' సినిమాలో పాట వచ్చే సందర్భాన్ని వివరించి పాట రాయమన్నప్పుడు 'గుల్జార్' ఈ పల్లవిని వినిపించాడు. లక్ష్మీ ప్యారేలకు 'గుల్జార్' రాసిన పాదాలు అర్థం కాలేదు. కానీ అవి లయబద్ధంగా ఉన్నాయని, పదాలు వినటానికి చక్కగా, ఆకర్షణీయంగా ఉన్నాయని భావించారు. పాటను రూపొందించారు. పాటలో 'గుల్జార్' రాసిన ఇతర పాదాల భావాలు అందరికీ సులభంగా అర్థమవుతాయి.

**సునాయి దేతీ హై జిస్‌కి ధడ్‌కన్**

తుమ్హార దిల్ యా హమార దిల్ హై

వినిపిస్తున్న హృదయనాదం నీ హృదయందా? నా హృదయమా?

అతి చక్కని భావం. పాట చిత్రీకరణ కూడా చక్కగా ఉండటంతో సినిమా 'హిట్' అవటంలో పాట ప్రధాన పాత్ర వహించింది. ఈ పాట ఎంతగా ప్రజాదరణ ఈనాటికీ పొందుతోందంటే ఇటీవలె శ్రేయా ఘోషాల్, విశాల్ మిశ్రాలు కలసి ప్రైవేట్ పాటగా పాడారు. గుల్జార్ రాసిన పాటకు కుణాల్ వర్మ తనవైన పాదాలు జోడించాడు. లక్ష్మీప్యారే సంగీతానికి జావేద్-మొహ్సిన్‌లు తమవైన జోడింపులు చేశారు. ఈ కొత్తపాట కూడా సూపర్ హిట్ అయింది. అర్థం తెలిసినా తెలియకున్నా ప్రతి ఒక్కరూ 'జి-హాల్-ఎ-మిస్కిన్, మకున్ బా- రంజిశ్, బహాల్-ఎ-హిజ్రా' అంటూ పాడేస్తున్నారు. తన్మయం చెందుతున్నారు.

ఎవ్వరికీ అర్థంకాని ఈ 'జిహాల్-ఎ-మిస్కిన్' అన్నది గుల్జార్ రచించినట్టు పొగుడుతున్నారు. కానీ ఈ పదాలు గుల్జార్ రాసినవి కావు.

'జె – హాల్' అంటే నా పరిస్థితిని గమనించు అని అర్థం. మిస్కిన్ అంటే, పేద బలహీనమైన అవసరం ఉన్న అన్న అర్థాలు వస్తాయి. 'మకున్' అంటే ద్వేషం, క్రోధం ప్రదర్శించకు అన్న అర్థం. 'బా – రంజిష్ ' అంటే శత్రువుగా చూడటం. 'బహాల్ – ఎ –హిజ్రా' అంటే విరహవేదనవల్ల కలిగిన గాయం. 'బేచార దిల్' అంటే అయ్యో పాపం అనదగ్గ హృదయం, నా అమాయక హృదయం, అన్న అర్థాలు తీసుకోవచ్చు. ఈ అర్థాలన్నీ కలిపితే 'విరహవేదన గాయం ఇంకా పచ్చిగానే ఉన్నా నా హృదయంపై క్రోధం ప్రదర్శించకు' అన్న తాత్పర్యం వస్తుంది. ఈ పదాలు నిజానికి 'గుల్జార్ 'రాసినవి కాదు. ఇవి పార్సీ భాష పదాలు. ఇవి రాసింది 13వ శతాబ్దపు సూఫీ కవి అమీర్ ఖుస్రో.

భారతదేశ సాంస్కృతిక చరిత్రలో అమీర్ ఖుస్రో అత్యంత ప్రధానమైన పాత్ర వహిస్తాడు. ఈయన ప్రభావం ఈనాటికీ ఈ దేశ సాహిత్య, సంగీత సంస్కృతిపై సజీవంగా ఉంది. భారతదేశంలో రాజభాష అయిన పర్షియన్ ప్రాధాన్యం తగ్గి, స్థానిక బ్రజ భాష, హిందీ, ఉర్దూ భాషల ప్రాధాన్యం పెరగటానికి బీజం నాటినవాడు అమీర్ ఖుస్రో. కత్తులతో సామ్రాజ్యాలను గెలవవచ్చు కానీ భారతీయుల హృదయాలను గెలవటం కష్టమని గ్రహించిన సుల్తానులు 'సూఫీ ప్రేమ' ద్వారా భారతీయులను ఆకర్షించవచ్చని గ్రహించారు. 'నిజాముద్దీన్ ఔలియా' శిష్యుడయిన అమీర్ ఖుస్రో సూఫీ సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేసేందుకు సంగీత, సాహిత్య మార్గాన్ని ఆశ్రయించాడు. ఫలితంగా 'ఖవ్వాలీ' ప్రక్రియ రూపొందింది. 'గజల్'ను భారతీయులకు పరిచయం చేశాడు. పర్షియన్ కవిత్వ రచన పద్ధతులను భారతీయులకు

పరిచయం చేశాడు. మస్నవి, ఖతా, రుబాయి వంటి రచన ప్రక్రియలను ప్రవేశపెట్టాడు. ముఖ్యంగా పర్షియన్ భాష రచన పద్ధతులకు స్థానిక బ్రజ్ భాష, హైందవి (హిందుస్తానీ , ఉర్దూ) భాషలలో రచనలు చేసి ఆయా భాషల ప్రాచుర్యానికి తోడ్పడ్డాడు. ముఖ్యంగా 'ఉర్దూ' భాష భవిష్యత్తులో పర్షియన్ భాషను అధిగమించేందుకు 'అమీర్ ఖుస్రో' రచనలు ప్రధాన పాత్ర వహించాయి. అందుకే ఆయనను 'ఉర్దూ భాష సాహిత్య పిత' అంటారు. పర్షియన్, అరబిక్, తుర్కి సంప్రదాయాలతో భారతీయ ఇస్లాం, సూఫీ సాంప్రదాయాలను జతపరచి ఆయన రూపొందించిన గాన ప్రక్రియలు, సాహిత్య ప్రక్రియలు భారతీయ సంగీతంపై ప్రభావం చూపించాయి. సాహిత్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. సామాజిక దిశను నిర్దేశించాయి. 'తరానా, త్రివత్‌లు –గీతం, తిల్లానాలుగా భారతీయ సంగీతంలో భాగం అయిపోయాయి. 'సితార్'ను రూపొందించింది ఈయనే అంటారు. అందుకే హిందుస్తానీ సంగీతంలో 'సితార్' ప్రధాన పాత్ర వహిస్తుంది.

అమీర్ ఖుస్రో ప్రధానంగా సూఫీ మత ప్రచారకుడు. సంగీతం, సాహిత్యం ఆయనకు సూఫీ మత ప్రచారానికి సాధనాలు. ఆయన రూపొందించిన ఖవ్వాలీ, గజల్‌లు భావావేశాల్ని ప్రేమోన్మాదంలా ప్రదర్శించినవే. ఆయన ప్రదర్శించిన స్త్రీ, పురుష ప్రేమ– భక్తుడు, భగవంతుడి నడుమ ఉండే అనిర్వచనీయమైన ప్రేమ. ఇది భారతీయ ధర్మంపై ఎంతగా ప్రభావం చూపించిందంటే భక్తిద్వారా దేశంలో చెలరేగిన సాంస్కృతిక, ధార్మిక పునరుజ్జీవన ఉద్యమంలో రాధాకృష్ణుల ప్రేమ, గోపికా కృష్ణుల ప్రేమ, 'సూఫీ' ప్రేమకు ప్రతిస్పందనగా ప్రత్యామ్నాయంగా ఎదిగింది. అభంగ్, భజన, కీర్తన వంటి ప్రక్రియల ద్వారా ఆధ్యాత్మికపుటాలోచనలతో పాటూ, సాంఘిక సంస్కరణలు, భక్తిప్రేమ విస్తృతంగా సమాజంలో విస్తరించాయి. ప్రేమ భగవంతుడన్న భావన భారతీయ ధర్మంలో భాగమైపోయింది. ఎలాగయితే సూఫీలు భగవంతుడి ప్రేమలో వెర్రివారై పోతారో, అలా భగవంతుడి ప్రేమలో సర్వం మరచి పోవటం,త్యాగం చేయటం, ప్రేమకు పెద్ద పీట వేయటం స్థిరపడింది. మజ్నూకు ఎలా ఎక్కడ చూసినా లైలా కనబడేదో, ఎవరేమన్నా 'లైలా' అనే వినపడేదో అలాంటి వెర్రి ప్రేమ అసలు ప్రేమకు నిదర్శనంగా నిలచింది. దీనికంతటకీ కారణం అమీర్ ఖుస్రో. ఆయన రాసిన గజల్ ఖవ్వాలీ 'జె–హాల్–ఎ–మస్కీన్ ' ఆయన ఉద్యమంలా చేపట్టిన సూఫీ మత ప్రచారంలో భాగమే!

**జె – హాల్ – ఎ మస్కీన్ మకున్ తఘాఫుల్**

**దురాయె నైనాన్ బనాయే బతియాన్**

**కి తాబ్ – ఎ హిజ్రాన్ నదారాం ఐ జాన్**

**న లెహూ కాహే లగాయే ఛత్తియాన్**

**ఇది అమీర్ ఖుస్రో రాసిన అసలు గీతం పల్లవి.**

ఈ బలహీన హృదయంపై దయచూపు. నాకు దూరంగా ఉండేందుకు కథలు కల్పించి చెప్పకు. భరించలేని విరహవేదన. ఓ ప్రియా, నన్ను దగ్గర తీసుకో. నీ దగ్గరే నన్ను శాశ్వతంగా ఉంచుకో.

ప్రియుడికి దూరమైన ప్రేయసి వేదన ఇది. భగవంతుడి ఎడబాటు సహించలేని భక్తుడి ఆవేదన స్వరూపం ఇది.

భారతీయ ధర్మంలో భగవంతుడి పద ధూళి చాలు. చరణసేవ చాలు. భార్య భర్త చరణదాసి. భర్త భగవంతుడు. అతడి సేవనే పుణ్యం అనే భావనల బీజం 'సూఫీ' తత్వ ప్రభావమే అంటారు కొందరు విశ్లేషకులు. ఈ పిచ్చి ప్రేమ చివరికి ఏ స్థాయికి చేరిందంటే, 'భగవంతుడి ప్రేమ' అదృశ్యమై 'పిచ్చి' మిగిలింది. అయిదో తరగతి పిల్లవాడు, మూడో తరగతి పిల్లను ప్రేమించి ఆమె కాదంటే ఆమెను చంపటమో, తాను చావటమో అనే స్థాయికి దిగజారింది.

**షబాన్ – ఎ – హిజ్రాన్ దరాఖ్ చూన్**

**జుల్ఫ్ – ఓ రోజ్ ఎ – వస్లాత్ చూన్ ఉమ్ర్– ఎ –కోరూష్**

**సఖీ, పియా కో జో మైన న దేఖూన్‌తో**

**కైసే కటూన్ అంధేరీ రతియాన్**

పై నాలుగు పాదాల్లో మొదటి రెండు పాదాలు అర్థం కావాలంటే పర్షియన్ భాష తెలియాలి. చివరి రెండు పాదాలు సులభంగా అర్థ మవుతాయి. ఎందుకంటే ఇది హిందీ భాషకు అతి దగ్గరగా ఉండే స్థానిక హైందవి భాషలో ఉంది. ఇది 'రేఖ్తా' లో రాసిన తొలి గజల్. ఖవ్వాలీగా ప్రసిద్దిపొందింది. దర్గాల దగ్గర కవ్వాల్ లు తన్మయత్వంతో ఈ పాటను పాడుతూంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. భక్తి భావంతో మైమరచిపోతాం. ఒక పాదం పర్షియన్ లో, మరొక పాదం హైందవీలో రాయటం వల్ల రెండు భిన్న సంస్కృతుల కలయికను సూచించటమే కాదు, స్థానికులకు అర్థమయ్యే భాషలోకి సూఫీ తత్వాన్ని అనువదించి సులభంగా చేరువ చేస్తున్నాడన్న మాట. దాదాపుగా ఇదే సమయానికి నెమ్మదిగా సంస్కృతంలోని పవిత్ర గ్రంథాలు స్థానిక భాషలలోకి అనువాదమవటమూ గమనించవచ్చు.

'విరహవేదనతో జ్వలించే రాత్రుళ్ళు, ప్రేయసి నల్లటి కురులలా సుదీర్ఘమైనవి. కలసి గడిపే దినాలు జీవితంలా అతి చిన్నవి' అంటుంది పర్షియన్ పాదం. 'ప్రేయసీ, నా ప్రియుడిని చూడకుండా ఈ సుదీర్ఘమైన నిశీధిని ఎలా గడపాలి?'

అంటుంది హైందవి భాషలోని పాదం. రెండవ పాదంలో పొందుపరచిన భావంతో బోలెడన్ని హిందీ సినిమా పాటలున్నాయి. 'నీవు రావు నిదుర రాదు. నిలిచిపోయె ఈ రేయి ' కూడా ఈ భావానికి ప్రతిబింబమే.

**యకాయక్ ఆజ్ దిల్ జో చశ్మ్ జాదూ**

**బా–సర్ – ఫరేబమ్ బా – బుల్ద్ తస్కీన్**

**కిసే పడీ హై జో జా సునావే పియారే**

**పీ కో హమారీ బతియాన్.**

హఠాత్తుగా నా మనశ్శాంతిని అందమైన రెండు నయనాలు, మంత్రముగ్ధమైన వాలుచూపులు కొల్లగొట్టాయి అంటుంది పర్షియన్ పాదం.

'నా ప్రియుడితో నేను చెప్పాలనుకుంటున్న సంభాషణల సందేశాన్ని ఎవరు నా ప్రియుడి దగ్గరకు చేరవేస్తారు?' అంటుంది హైందవి భాష పాదం. కళ్లు కలవగానే మనశ్శాంతి పోవటం అందమైన కళ్లు హృదయం దోచుకోవటం వంటి భావాలతో మన సినీగీతాలు నిండిపోయాయి.

**చూన్ షామ్ – ఎ – సాజాన్ చూన్ జర్రా**

**హైరాన్ జ మెహ్ర్– ఎ– ఆన్ – మాహ్ బగాశ్తామ్ ఆఖిర్**

**నా నీంద్ నైనన్ న అంగ్ చైనన్**

**న ఆప్ అవే న భేజే పతియాన్**

వొత్తిలా కాల్తున్నాను. పోక చెక్కలా నలుగుతున్నాను. ఆ చంద్రుడి కోసం వేదనలో విరిగి చెల్లాచెదరైపోతున్నాను.

కంటికి నిద్దుర రాదు. నాకు విశ్రాంతి లేదు. ఆయన రాడు. కబురైనా పంపడు. ఈ భావాలయితే మన సినిమా పాటలలో కో కొల్లలు.

బా-హోన్ -లు రోజ్ – ఎ- విసాల్ – ఎ- దిల్బర్ కీ దాద్

మారా గరీబ్ ఖుస్రావ్

సపిత్ మన కె వరాయే రాఖున్

జో జా కె పావ్  పియా కీ ఖతియాన్

నా ప్రేయసి కలవాలని రోజూ చేసే అభ్యర్థనలు ఖుస్రూను  చంపేస్తున్నాయి. శాపానికి గురయిన నా హృదయపు బూడిదను ప్రేయసికి ప్రేమగా సమర్పించుకుంటాను. 'అమీర్ ఖుస్రావ్' రాసిన ఈ విరహగీతాన్ని స్త్రీ పురుష ప్రేమ గీతంలా అర్థం చేసుకోవచ్చు. భగవంతుడు ప్రియుడు, భక్తుడు ప్రేమికగా, వారి విరహగీతంగా భావించవచ్చు. అయితే ఖుస్రో సూఫీ కాబట్టి భక్తి భావనలే ఆయన కవితల్లో కనిపిస్తాయి. స్త్రీ పురుష ప్రేమ భావన, విరహ వేదన ప్రజలకు సులభంగా అర్థమవుతుంది. ఈ భావనద్వారా దైవ భావనను బోధపరచటం సులభం. 'సూఫీ'లు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. భారతదేశంలో ఈ మార్గాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు చేరువచేసింది అమీర్ ఖుస్రో..

'అమీర్ ఖుస్రో' వల్ల ఉత్తర భారతంలో ఉర్దూ ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా పర్షియన్ భాష  వాడకం తగ్గింది. ముఖ్యంగా, బయటనుంచి వచ్చిన  వారి సంఖ్యకన్నా ఈ దేశంలో పుట్టి పెరిగే ఇస్లామీయుల సంఖ్య పెరుగుతుండటంతో 'ఉర్దూ' ప్రాధాన్యం హెచ్చింది. 17వ 18వ శతాబ్దానికల్లా ఉర్దూ, పర్షియన్‌ను దాటిపోయింది. పర్షియన్ భాషపై మక్కువ ఉన్నా ప్రజాదరణ పొందినవి ఘాలిబ్ ఉర్దూ గజళ్లు. అయితే ఉర్దూ ప్రాధాన్యం పెరుగుతూ, ఉర్దూ సాహిత్య సృజన అధికమయ్యే సమయానికి 'ప్రేమ' తత్వంలోని భగవంతుడు అదృశ్యమై స్త్రీ పురుష ప్రేమ ప్రాధాన్యం హెచ్చింది. అందుకే ఘాలిబ్‌తో సహా పలు గజళ్లు మామూలు ప్రేమ గజళ్లే. భక్తి భావం అదృశ్యమైపోయింది.  ఘజల్, ఖవ్వాలీలు ప్రధానంగా భక్తి భావాన్ని ప్రదర్శించే మాధ్యమాలన్న ఆలోచన అడుగంటి అవి ప్రేమ భావనను, విరహ విషాదాన్ని ప్రతిబింబిస్తాయన్న ఆలోచన ఊపందుకుంది.

అమీర్ ఖుస్రో ఖవ్వాలీ 'జె – హాల్ – ఎ – మిస్కిన్'కు కూడా అదే గది పట్టింది. 'గులామీ' సినిమా కోసం గుల్జార్, అమీర్ ఖుస్రోవ్ గజల్ నుండి పల్లవిని తీసుకున్నా  పాట మొత్తం కనిపించేది స్త్రీ పురుష ప్రేమ మాత్రమే. గుల్జార్ పాటను ఎంతో కవితాత్మకంగా రచించినా, పాటలో కనిపించేది స్త్రీ – పురుష ప్రేమ తప్ప భక్తుడు, భగవంతుడి ప్రేమకాదు

ఆధ్యాత్మక చింతనకాదు. కానీ, తాను ఖుస్రావ్ పల్లవిలోని పాదాన్ని గ్రహించానన్న స్పృహ వుండటంతో తన రచన స్థాయి వీలయినంత ఉన్నతంగా, మార్మికంగా వుండేట్టు జాగ్రత్త పడ్డాడు గుల్జార్.

**వో ఆకె పహెలుమె ఐసె బైఠే**

**కె షాం రంగీన్ హోగయీహై**

**జరా జరా సీ ఖిలీ తబీయత్**

**జరాసి గంగీన్ హోగయీ హై**

సినిమా పాట ఇది. గుల్జార్ రాసింది. ఆమె వచ్చి నా సరసన కుర్చోవటంతోటే సాయంత్రం అందంగా మారిపోయింది. నాకు కాస్త ఆనందంగా ఉంది. కాస్త విషాదంగా ఉంది. 'తబీయత్' అంటే ఆరోగ్యం. 'ఖిలీ తబీయత్' అంటే ఆరోగ్యం వికసించటం. హిందీ పాటలు మామూలు పాటలు కావు. వాటిలో ప్రతి పదార్ధ తాత్పర్యం తీసుకుంటే హాస్యాస్పదంగా ఉంటుంది. మన ఆరోగ్యం బాగవటం అంటే హాయిగా, ఆనందంగా ఉండటం. మొదటిసారి ఆమె సరసకు రాగానే సాయంత్రం ఆహ్లాదకరంగా మారింది. అతడికి సంతోషం కలిగింది. విషాదం ఎందుకంటే, మళ్ళీ ఇది అర్ధం చేసుకోవాలంటే ఎంతో విశ్లేషించాల్సి ఉంటుంది. నిజానికి విషాదం లేని ఆనందం లేదు. ఆనందం లేని విషాదం ఉంటుంది. అందుకే ఓ కవి 'ఉన్ ఆఖోంక హస్‌నాభి క్యా, జిన్ ఆంఖోంమే పానీ నహో' అన్నాడు. కళ్లల్లో నీళ్లు లేని నవ్వు నవ్వు కాదు అన్నాడు. అంటే విషాదం తెలియని వాడికి ఆనందం తెలియదు.

**అజీబ్ హై దిల్ క దర్ద్ యారో**

**న హోతో ముష్కిల్ హై జీనా ఇస్‌కా**

**జో హోతా హర్ దర్ద్ హై ఎక్ హీరా**

**ఎక్ ఘం హై నగీనా ఇస్కా**

హృదయపు వేదన విచిత్రమైనది. అదిలేకపోతే బ్రతుకు దుర్భరం. నిజానికి ప్రతి వేదన ఒక విలువవైన వజ్రం. కానీ ఒక దుఃఖం మాత్రం జీవితంలో విలువైన ఆభరణం. ఇక్కడ కవి ప్రేమ వేదన గురించి ప్రస్తావిస్తున్నాడు. ఒక ప్రత్యేకమైన

వేదన మాత్రం విలువైనది. ఒక వ్యక్తికి జీవితంలో ఎంతో మంది తారస పడతారు. కొందరు హృదయానికి దగ్గరగా వస్తారు. వారు దూరమైనప్పుడు బాధ కలుగుతుంది. కానీ ఒక ప్రత్యేకమైన వ్యక్తి మాత్రం ఎంతో దగ్గరగా వస్తాడు. ఆ వ్యక్తి సాంగత్యం ఇతరాలన్నిటికన్నా ప్రత్యేకం.

**కభీకభీ షాం ఐసె ఢల్తీ హై**

**కె జైసె ఘూంఘట్ ఉతర్ రహాహై**

**తుమ్హారి సీనే సె ఉఠ్ త ధువా**

**హమారె దిల్‌సె గుజర్ రహీహై**

ఒకోసారి సాయంత్రం జగతిపై ఎలా ఆవరిస్తుందంటే, ప్రేయసి వదనంపై ముసుగు పడుతున్నట్టు. సాయంత్రం అవటాన్ని ఎంతో అందంగా చెప్పాడు. చక్కటి ఊహ. సాయంత్రం అవటం అంటే కొద్ది కొద్దిగా చీకటి పడుతూండటం. ప్రేయసి వదనంపై ముసుగు జారటం అంటే జగతి చీకటి అయిపోవటం. ఆమెను చూడకుండా ఉండలేడు. కానీ కొద్ది కొద్దిగా ముసుగు జారుతూంటే ఎంతో అద్భుతంగా ఉంటుంది. కురులను కప్పేస్తుంది. తరువాత పాలభాగం. ఆ తరువాత ముక్కు, బుగ్గలు. అప్పుడు పెదిమలు, ఆ క్రింది గడ్డం మాత్రం కనిపిస్తూంటూంది. అనేక శిల్పాలు ఇలా ముసుగు కప్పుకున్న అందమైన యువతులవి, అద్భుతమైనవి లభిస్తాయి. సాయం సమయంలో ఆకాశంలో ఆవిష్కృతమయ్యే పలు వర్ణాలు ప్రేయసి వదనంపై ద్యోతకమవుతాయి. పాలభాగం రంగు, పెదిమలు, బుగ్గలు, చుబుకం.. ఇలా ఊహిస్తూంటే కవి హృదయం సాక్షాత్కరిస్తుంది. ఒక అమూర్త కవి అక్షరాల ద్వారా సృజించగల అందమైన అమూర్త దృశ్యం అనుభూతికి వస్తుంది.

ఒక అందమైన దృశ్యం చూసినప్పుడు మనస్సు ఎంత ఆనందంతో ఉత్తేజితమవుతుందో, అంతే విషాదభావనతో సతమతమవుతుంది 'సీనే సే ధువా' అన్నదాన్ని ఈ భావంతో అర్థం చేసుకోవాలి. హృదయంలోంచి పొగ రావటం అంటే దీర్ఘమైన నిట్టూర్పు అనుకోవచ్చు. అది ఆనందంతో కావచ్చు... విషాదంతో కూడా కావచ్చు.

సాధారణంగా ఒక యువతికి తన అందం ప్రియుడిని చలింపచేయటంలో కలిగే ఆనందంతో ఇతర ఏ ఆనందాన్నీ పోల్చటం కుదరదు. ప్రియుడికి ప్రేయసి అందాన్ని భౌతికంగా అనుభవించటం కన్నా ఆమెని చూస్తూ, ఆ అందాన్ని మనసుతో అనుభవించటం అత్యంత ఆనందాన్ని, సౌఖ్యాన్నిస్తుంది. అందుకే ఓ కవి 'తేరె సాయే కొ సమఝ్ కర్ మై

హసీన్ తాజ్ మహల్, చాంద్నీ రాత్ మే నజ్రోం సె తుఝే ప్యార్ కరూ' అన్నాడు. ఆమె నీడనే తాజ్‌మహల్‌గా భావిస్తూ, వెన్నెల రాత్రులలో ఆమెను కళ్లతో ప్రేమిస్తాడట. మరో కవి 'తుం అగర్ మేరి నజ్రోం కె ఆగే రహో, మై హర్ ఎక్ షయ్ సే నజ్రే చురాతా రహూ' అన్నాడు. నువ్వు నా కళ్ల ఎదుట ఉంటే, నా కళ్లకు ఇంకెవ్వరూ కనబడరంటాడు. అంటే, ఆమె ఎదురుగా ఉంటే, ఇంకేమీ అవసరం లేదన్నమాట. సాయంత్రం జగతిని ఆవరించటం ఒక అందమైన దృశ్యం. ఎంత చూసినా తనివి తీరదు. కానీ పూర్తిగా చీకటి పడితే ఏదీ కనబడదు. ఆ అందం అదృశ్యమైపోతుంది. అదీ విషాదం. దీన్ని ప్రేయసి వదనం పై జారుతున్న ముసుగుతో పోల్చటంతో, ఆమె అందం కనుమరుగవటంవల్ల అతని హృదయంలో నిట్టూర్పు, తన అందం చూసి ప్రియుడు ఆనందిస్తూంటే సంతోషిస్తున్న ఆమె, అది ముసుగుతో కప్పటం వల్ల అతడికి కనబడదన్న విషాదంతో.... అందుకే నా హృదయంలో నిట్టూర్పు, నీ హృదయం అనుభవిస్తోంది అంటున్నాడు. ఒకరి ఆనందం మరొకరు, ఒకరి విషాదం మరొకరు అనుభవించే ఉత్తమమైన ప్రేమ అన్నమాట.

**యే షర్మ్ హైయా, హయాహై క్యా హై**

**నజర్ ఉఠాతే హి ఝుక్ గయా హై**

**తుమ్హారి పల్కోం సె గిర్ కె షబ్నమ్**

**హమారి ఆంఖోం మె రుక్ గయీ హై**

అద్భుతం అనిపించే పదాలతో అత్యద్భుతమైన భావాల్ని ప్రదర్శించాడు గుల్జార్. ఆమె కళ్లు ఎత్తుతోంది, వెంటనే దింపేస్తోంది. ఇది సిగ్గా? లేక జంకా? అని అడుగుతున్నాడు ప్రియుడు. నిజానికి ఒకరికొకరు అలవాటుకాక మునుపు ప్రేయసి ప్రియుడిని కళ్లెత్తి చూడలేదు. చూడాలని ఉన్నా కళ్లు భారమై వెంటనే దించేసుకుంటుంది అలాంటి సందర్భంలో ప్రియుడు 'యే ఉఠే సుబహ తలే, యే ఝుకే షామ్ ఢలే' అంటాడు. ఆమె కళ్లు ఎత్తితే ఉదయం, కళ్లు దింపితే రాత్రి అన్నమాట ప్రియుడికి. 'యె పల్కోంకె చిల్మన్ ఉఠాకర్ గిరానా, గిరాకర్ ఉఠానా గజబ్ హోగయా' అంటాడింకో కవి. 'పల్కోంక చిల్మన్' చిల్మన్ అంటే పరదా, వస్త్రం. 'పల్కోంక చిల్మన్' కనురెప్పలను పరదాలా భావిస్తున్నాడు. ఆ పరదాను ఎత్తివేయటం, అంటే కళ్లు తెరచి మూయటం, దించి ఎత్తటం, అంటే కళ్లు మూసి తెరవటం 'అద్భుతం' ఆ ప్రియుడికి . ఇదొక అత్యంత ఆనందకరమూ, ఉత్తేజితం అయిన శృంగారం , కొత్తగా పెళ్ళయిన భార్యా భర్తలు, కొత్తగా సాన్నిహిత్యం పెరుగుతున్న ప్రేయసీ, ప్రియుల నడుమ. అందుకే ఈ పాటలో ప్రియుడు, ఆమె అతడివైపు కళ్లెత్తి చూసి వెంటనే కళ్లు దించటం సిగ్గువల్లనా? జంకు వల్లనా? అని అడుగుతున్నాడు.

అతడి ప్రశ్నకు ఆమె 'నీ కనురెప్పల నుండి జాలువారే తుషార బిందువు నా కళ్లల్లో నిలిచిపోయింది' అంటోంది. హృదయం పిండేసేంత అద్భుతమైన ఊహ. 'అమీర్ ఖుస్రో' తన రచనలో అణువణువునా భగవద్భావనతో అలరిస్తే, గుల్జార్ ప్రేమ పాటలో అత్యంత సుందరమూ, అర్ధమయీ అవనట్టున్న భావాల ద్వారా అలౌకికానందం కలిగిస్తాడు. అతడి కళ్లల్లో నీళ్లు ముత్యాల్లాంటివి. అవి ఆమె కళ్లల్లో నిలిచిపోయాయి. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అంటారు. తీవ్రమైన ప్రేమ భావన కూడా, ప్రేమ సౌఖ్య భావన కూడా కళ్లల్లో నీళ్లు నింపుతుంది. అతడి హృదయంలో నిట్టూర్పు, ఆమె హృదయంలోనూ కలిగినట్టూ, అతడి కళ్లల్లో కరిగిన నీరు, ఆమె కళ్లల్లో నిలిచిపోయింది. ఇదీ గుల్జార్, అమీర్ ఖుస్రో స్ఫూర్తితో రాసిన పాట.

గుల్జార్ పాటను తీసుకుని కొత్తగా ఇదే పాటను మళ్లీ కొత్తగా పాడి విడుదల చేశారు. గుల్జార్ పల్లవిని అలాగే ఉంచి (అమీర్ ఖుస్రో పదాలతో, అదే పాటకు) పల్లవులు కొత్తగా రాసుకున్నారు. అమీర్ ఖుస్రో పాటలోని భక్తిభావం లేకున్నా గుల్జార్ కనీసం భావంతో అలౌకికానందాన్ని కలిగించాడు. కొత్త పాటలో అదీలేదు. కొత్త యువ రచయితకు అమీర్ ఖుస్రావ్, అతని స్ఫూర్తితో పరిచయం వుందో? లేదో?

**యాద్ రఖూంగా మై యే**

**బేవఫాయీ యార్ మెరే**

**సిర్ఫ్ లగీ చాహత్ మే**

**తన్హాయీ హాథ్ మేరే**

నా ప్రియ మిత్రమా నీ మోసం నేను గుర్తుంచుకుంటాను. మరచిపోను. ప్రేమలో నాకు ఒంటరితనమే మిగిలింది.

**మై దిల్ కో సంఝూలూంగా**

**తూ ఖయాల్ తేరా రఖ్నా**

నేను నా హృదయానికి నచ్చ చెప్పుకుంటాను. నువ్వు జాగ్రత్తగా ఉండు.

ఇప్పుడు 'జె –హాల్ – ఎ – మస్కీన్' పల్లవి వస్తుంది. అమీర్ ఖుస్రావ్ పదాలు కూడా శక్తిహీనమై అర్థంకోల్పోయిన శబ్దాల్లా మిగులుతాయి. చరణం మొదలవుతుంది.

**టూటే దిల్ కో జోడే కైసే**

**యే బతాతే జావో**

**జిందా రహనే కీ బస్ హంకో**

**ఏక్ వజా దే జావో**

పగిలిన హృదయాన్ని ఎలా అతికించుకోవాలో చెప్పి వెళ్ళు. బ్రతికి ఉండటానికి ఒక కారణం ఇచ్చి వెళ్ళు.

**యూన ఫేరో హం సే**

**ఆంఖే తో మిలాతే జావో**

**కోయి వాదా కర్ జావో**

**కోయి దువా దే జావో**

**మెరేలియే థోడీసీ దిల్మే జగా రఖ్నా**

అలా కళ్ళు తిప్పుకుని వెళ్ళిపోకు కళ్ళు కలిపి వెళ్ళు. ఏదైనా మాట ఇచ్చి వెళ్ళు. నా గురించి దైవాన్ని ప్రార్థించి, ఆ ఫలం ఇచ్చి వెళ్ళు. అంటే నాకోసం దైవాన్ని ప్రార్ధించు అని భావం. నాకోసం నీ హృదయంలో కాస్త స్థలం ఉంచు.

**ఖుషీ తుమ్హారీ హై జబ్ ఇసీమే**

**తో హం భీ ఆసూ ఛుపాహీ లేంగే**

**వజాహ్ జో పూఛేగా యే జమానా**

కోయీ బహానా బనాహీ లేంగే.

ఒకవేళ నేను దుఃఖించక పోవటం నీకు సంతోషకరమైతే, కన్నీళ్లను అదుపులో పెట్టుకుంటాను. కారణం ఎవరైనా అడిగితే ఏదో చెప్పి తప్పించుకుంటాను.

చాహే  జో తూ పాయే వో తూ

యే  మెరీ ఫర్ యాద్ హై

జీ లే చాహే తుం బిన్ యారా

హోనా తో  బర్బాద్ హై

నువ్వు కోరుకున్నది నీకూ లభించాలన్నది నా ప్రార్ధన. నువ్వు సంతోషంగా జీవించు. నువ్వు లేక నేను నాశనమై పోతాను.

జబ్ తక్ న మర్ జాయే హం

ఉస్ పల్ కా ఇంతె జార్ హై

ఇత్  నా హి థా కహెనా

తక్దీర్‌మే తేరామేరా

సాథ్ యహీన్  తక్ థా

మరణించే ఘడియ కోసం ఎదురు చూస్తూంటాను. ఇంతే చెప్పాలనుకుంటున్నాను. మన కలయిక ఇంతే మన అదృష్టం ప్రకారం

ఇదీ పాట.

ఆకాశం నుండి స్వచ్ఛంగా దిగిన నీరు, భూమిపై ప్రవహించి, నదియై, మహానదియై, చివరికి చిన్న నీటిపాయ అయినట్టు, అమీర్ ఖుస్రో భక్తి ఖవ్వాలీతో మొదలై, గుల్జార్ అమూర్త  శృంగార కవిత్వం నుండి, కుణాల్ వర్మ ప్రేమగీతం స్థాయికి వచ్చింది హిందీ పాట. గమ్మత్తయిన విషయమేమిటంటే, చాలామంది అమీర్ ఖుస్రోను మరచిపోయి ఇది గుల్జార్ గీతం అనుకోవటం. అందుకే మన గతాన్ని భావి తరాల స్మరణకు అందించకపోతే, నూతన తరాలు  గతంలేని వర్తమానంలో, బ్రతుకుతారు. శూన్యమైన భవిష్యత్తు వైపు దృష్టిలేని కళ్లతో చూస్తారు. మన సమాజం అందుకు చక్కటి నిదర్శనం.

(వచ్చేనెల మరిన్ని  పాటలతో కలుద్దాం..)

Click here to share your comments